## లవ్లీ స్టోరీస్

# నిశ్శబ్దంలో నువ్వు నేను

“ప్రియా! నీకు గుర్తుందా? ఆ రోజు నిన్ను నేను మొదటిసారి దర్శించినరోజు అది ఆషాఢమాసం తొలిరోజు. విచిత్రం కదూ? బెంగుళూరు సెంట్రల్ లైబ్రరీలోంచి నువ్వప్పుడే బయటికొచ్చి కబన్‌పార్క్ అందాలు గమనిస్తూ నడుస్తున్నావు. ఆ సమయంలో నువ్వు ధరించిన దుస్తులు కూడా జ్ఞాపకం వున్నాయి నాకు. ఆ సంఘటన జరగడం నిన్ననో మొన్ననో అన్నంత స్పష్టంగా జ్ఞాపకం వున్నాయి నాకు. లేతాకుపచ్చ రంగు చీరమీద నక్షత్రాలు మెరిసినట్లు ఆ జరీ అల్లిక, ఆ నక్షత్రాల మధ్య పున్నమినాటి నిండు చందమామలో వెలిగిపోతున్న నువ్వు... ఎలా మర్చిపోగలను ఆ దృశ్యాన్ని? తలచుకుంటే ఇప్పటికీ నాకు పులకరింత కలుగుతుంది. పూల మొక్కల మధ్య విరిసిన మొగ్గల్లా వున్న కొంత మంది పసిపిల్లలు ఆడుకుంటూ ఆడుకుంటూ వచ్చి అనుకోకుండా నీమీద పడిపోయారు. ఆ సమయంలో నీ చేతిలో వున్న పుస్తకం ఒకటి జారి దూరంగా పడిపోయింది. ఆ సమయంలోనే నవ యవ్వనంలో వున్న ఒక యువకుడు— వీడు ఆ పుస్తకం తీసి నీకందించాడు. జ్ఞాపకం వుందా ప్రియా నీకా రోజు? మన చూపులు తొలిసారిగా కలుసుకున్న మధురమైన రోజు?”

“అవును, ఆషాఢమాసం తొలిరోజు! నిజంగానే విచిత్రం కదూ? కాళిదాసు ‘మేఘసందేశం’ ఆషాఢమాసం తొలిరోజునాడే ప్రారంభమవుతుంది. ఏమిట్రా కమ్మని శ్లోకం? “... ఆషాఢస్య ప్రథమదివసే మేఘమాశ్లిష్టసానుం వప్రక్రీడాపరిణత గజప్రేక్షణీయం దదర్శ”— ఆషాఢమాసం తొలిరోజునాడు కొంత చరియను కుమ్ముతూ ఆడుకుంటున్న మేఘాన్ని యక్షుడు చూశాడని కదూ? ఆ సమయంలో నా చేతిలో వున్న ఆ పుస్తకం మేఘసందేశం.”

“మేఘసందేశం లాంటిదే మన ప్రేమ. మొదట ఆ యక్షుడూ యక్షకాంతల్లాగే మనం. తర్వాత ఏదో శాపం తగిలినట్టు...”

“వద్దు. ఆ విషయం ఇప్పుడు ప్రస్తావించవద్దు. నాకు బాధ కలుగుతుంది.”

“ఆ రోజున ఆ విధంగా నిన్ను చూసిన ఆ ముహూర్తం ఎంత బలమైంది! రెప్పపాటు నిన్ను చూశాను, అంతే. నన్ను నేనే మర్చిపోయాను. తేరుకొని చూసేసరికేముంది? నువ్వు నా ఎదురుగా లేవు. అయినా నీ రూపం మాత్రం నా హృదయంలో చిరస్థాయిగా ముద్రవేసుకుంది.”

“నేనూ అలాగే అయ్యాను. నువ్వు గమనించావో లేదో, పుస్తకం అందుకుంటుండగా నా చెయ్యి చిగురుటాకులా సన్నగా వణికింది. ఆ క్షణంలో నీ తొలిచూపులోని మధురభావమేదో సూటిగా నా హృదయాన్ని తాకింది. ఆ క్షణంలో నాలో ఏదో కలవరపాటు. కాలు కదపాలన్నా కదపలేని అశక్తత ఏదో నన్నావరించింది. అయినా స్త్రీ సహజమైన వివేకమేదో ఆరుబయట ఒక యువకుడి ముందు నన్ను అలాగే నిలిచిపోనీయకుండా చేసింది. నన్ను నేనే మేల్కొలుపుకొని ఆ తన్మయావస్థలోంచి బయటపడి చిప్పక్కడే వదిలి వెళ్ళిపోయాను.”

“నువ్వు వెళ్ళిపోయావు. నేను మాత్రం నువ్వింకా నా ఎదురుగానే వున్నావన్న భ్రమతో ఎలావున్నవాడినలాగే నుంచుండిపోయాను. ప్రేమసర్పదష్టుడినైపోయి చేష్టలుడిగి, కదలలేక మెదలలేక ఎంతసేపో తెలియలేక అక్కడే ఆ నవాంధకార ప్రదేశంలోనే నిన్ను తప్ప చూడలేక నా గుండె నేను తడుముకుంటూ నీ ప్రేమవర్షంలో కళ్ళు తడుపుకుంటూ వుండిపోయాను.”

“నేనూ అంతే. అక్కడి నుంచి వెళ్ళిపోయినా నీ దగ్గరే నేనుండిపోయాను. ఆ రాత్రి నుంచే నా కంటికి నిద్ర కరువైపోయింది. ఇలా ఎందుకు జరిగిందని ఆలోచించడంతోనే ఆ రాత్రంతా సరిపోయింది. నువ్వు చెప్పు, ఎందుకలా జరిగింది? అంత అకస్మాత్తుగా అంత హఠాత్తుగా... ఎలా సాధ్యపడింది?”

“ఆ ప్రశ్నకు సమాధానం తెలిస్తే ఈ సృష్టికే అర్థం తెలిసిపోతుంది. కొన్ని ఎందుకు జరుగుతాయో తెలియకుండా వుండిపోవడంలోనే అందముంది. ఎందుకు జరిగినా ఎలా జరిగినా చల్లగాలి సోకుతూనే నల్లమబ్బు కరిగినంత సహజంగా వసంతాగమనం గమనిస్తూనే కోయిల పాడినంత తియ్యగా ఆ సంఘటన జరిగింది. మన మధ్య ప్రేమ ఆ తొలిక్షణంలోనే అంకురించింది.”

“ఆ తర్వాత...”

“ఆ తర్వాత భళ్ళున తెల్లవారింది. నిన్ను మళ్ళీ చూడాలనే తపన నన్ను నిలవనివ్వలేదు. నువ్వు తిరిగివస్తావని ఏదో వెర్రి ఆశ నా అణువణువునా దావానలంలా వ్యాపించింది. లైబ్రరీకి మళ్ళీ వెళ్ళాను. నా పిచ్చిగానీ అంత పొద్దున్నే లైబ్రరీ ఎవరు తెరుస్తారు? చందమామ రాకకోసం ఎదురుచూస్తున్న చకోరంలా అక్కడే మెట్లమీద చి

## రచయిత ఎవరో ఎదురు చూడండి

రాకకోసం దారివెంట చూపుపరిచి కూర్చుండిపోయాను. చివరికి కొన్ని యుగాల నిరీక్షణ తర్వాత లైబ్రరీ తలుపులు తెరిచారు. నువ్వు రాలేదు. నేనాశించిన వసంతం రాలేదు. ఆ రోజంతా పిచ్చివాడిలా ఎదురుచూశాను. ఎన్నో పుస్తకాలు తిరగేశాను. ఒక్క పుస్తకమూ చదవలేదు. నువ్వు మాత్రం రానేలేదు. ఎందుకు చేశావలా? అది నీకేమైనా న్యాయంగా అనిపించిందా?"

"నీకు తెలియదేమోగానీ నువ్వక్కడ నాకోసం ఎదురుచూస్తుంటావని ఏ వనదేవతో నా హృదయానికి చెప్పింది. మనసు ముందుకు వెళ్ళమని ప్రేరేపించింది. దేహం మాత్రం జంకుతో ఆగిపోయింది."

"ఆ రోజు హతాశుడినై అక్కడినుంచి తిరిగి వచ్చేశాను. ఆ మర్నాడు మళ్ళీ వెళ్ళాను. అప్పుడూ నువ్వు రాలేదు. నడిసముద్రంలో దివ్య రత్నం పోగొట్టుకున్న మందభాగ్యుడు దోసిలితో సముద్రాన్ని తోడబోయినట్టు నువ్వెక్కడైనా కనిపిస్తావేమోనని నగరమంతా తిరిగాను. నువ్వు కనిపించలేదు. అలా నాలుగురోజులు గడిచిపోయాయి. ఆ నాలుగురోజులూ ఎంత కష్టం మీద గడిచాయో మాటల్లో చెప్పలేను. చివరికి అయిదవరోజు ఆకాశం నుంచి రాలిపడిన తారలా కళ్ళు మిరుమిట్లు గొలుపుతూ నువ్వు మళ్ళీ లైబ్రరీలో సాక్షాత్కరించావు. ఆ క్షణంలో నా మనసులో చెలరేగిన భావావేశం ఏమని చెప్పను? కాళిదాసు కూడా వర్ణించలేని భావావేశమది."

"నాలుగు రోజులు ఎలాగో ప్రయత్నం మీద ఆ వైపు రాకుండా మనసుకు కళ్ళెం వేయగలిగాను. అయిదవరోజున అది నాకు సాధ్యం కాలేదు. నువ్వక్కడే వుండి నాకోసం ఎదురు తెన్నులు చూస్తుంటావని రాత్రి గడుస్తానే సూర్యుడు ఉదయిస్తాడన్నంత సహజమైన నమ్మకం నాలో."

"నిజమే. మనసులో ఒకటైనప్పుడు దూరాన వుండి కూడా ప్రేమికులు ఒకరితో ఒకరు మాట్లాడుకోగలరు. ఒకరినొకరు చూడగలరు. ఏంచేస్తున్నారో ఏం ఆలోచిస్తున్నారో తెలుసుకోగలరు. ఆ అద్భుతశక్తి సృష్టిలో ప్రేమికులకు మాత్రమే వుంది."

"నా నమ్మకం నిజం చేస్తూ నాకోసం నువ్వెదురుచూస్తూ అక్కడే వున్నావు. నిన్ను పలకరించవచ్చని నాకు తట్టనే లేదు. పలకరించక పోయినా నీతో మాట్లాడుతున్నాననే విచిత్రమైన భ్రాంతి నాలో."

"నాలోనూ అదే భ్రాంతి. పుస్తకం చదువుతున్నానన్న మాటేగానీ నీతోనే నేను మాట్లాడుతున్నాను. 'ఎవరు నువ్వు? ఎందుకు నన్నిలా

**అతని కళ్ళ నిండా ఆమే ఉంది...**



ఈ కథ కోసం ప్రత్యేకంగా తీసిన ఫోటో ఇది. ప్రత్యేక ఫోటో: వై.ఎస్.ఎన్. మూర్తి

కలవరపరుస్తున్నావు?' అని అడుగుతున్నాను. "నేను నీ దాన్ని. ఎక్కడో దిగంతాల అవతలి నుంచి నీకోసమే నేనొచ్చాను. నీదాన్ని కాబట్టే నిన్ను కలవరపరుస్తున్నాను. నన్ను సరిగ్గా గుర్తించలేదు నువ్వు, అని నువ్వు సమాధానం చెబుతున్నావు. 'నిన్ను గుర్తించక పోవడమేమిటి? మొట్టమొదట నిన్ను చూసిన క్షణంలోనే నువ్వెవరివో నేను గుర్తించాను' అది నేను తిరుగు సమాధానం చెబుతున్నాను. అలా ప్రశ్నోత్తరాలలోనే ఆ రోజంతా గడిచిపోయింది. నిన్ను నేను నన్ను నువ్వు చదువుకోవడంలోనే ఆ లైబ్రరీకి సార్థకత వచ్చింది."

"ఆ తర్వాత నేను రోజూ వచ్చాను. దాదాపు పక్షం రోజులు అదే లైబ్రరీలో మనం ఒకరినొకరం చదువుకున్నాం. చిత్రం— పెదవి విప్పి వాస్తవంగా ఒక్కమాట కూడా మాట్లాడుకోలేదు. కానీ ఒకరినొకరం పూర్తిగా అర్థం చేసుకున్నాం. ఆ పక్షం రోజులు మనకు వెయ్యి జీవితకాలాలకు సరిపడా పరిచయాన్ని కలిగించాయి. మన భావాలు పరస్పరం పాలూతేనెలా కలిసిపోయాయని అప్పుడే నేను గుర్తించాను. నాలాగే నీకూ కవిత్వమంటే ప్రాణం. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు— ఈ మూడు భాషల సాహిత్యంతోనూ నీకు పరిచయం వుంది నా లాగే. నాలాగే నీలోనూ అభ్యుదయ భావాలున్నాయి. నాలాగే నీలోనూ ఆర్ద్రహృదయం వుంది. ప్రేమార్ద్ర హృదయం వుంది. మేడ్ ఫర్ ఈచ్ అదర్ అనేమాట మనకోసమే పుట్టింది."

"నేను కూడా నిన్ను అలాగే దగ్గరగా అర్థం చేసుకున్నాను. నువ్వూ నాలాగే బెంగుళూరుకు కొన్నాళ్ళపాటు సెలవులు గడపడానికి వచ్చావు. నాలాగే నీకూ కన్నడ భాష రాదు. నాలాగే తెలుగు నీ మాతృభాష. అప్పుడే నాకు తెలుసు— ఏదో ఒకరోజు నువ్వూ నాలాగే బెంగుళూరు వదిలి వెళ్ళిపోతావని. ఎక్కడికి వెళ్తావో మాత్రం నాకు తెలియదు. చివరికా రోజు రానే వచ్చింది. ఆ రోజు కూడా ఇప్పటికీ నాకు బాగా గుర్తుంది. ఆ రోజు నువ్వు ఒంటరిగా లైబ్రరీకి రాలేదు. నీ వెంట నీ స్నేహితురాలు కూడా వచ్చింది. ఆ రోజే నువ్వు బెంగుళూరు వదిలి వెళ్ళిపోతున్నావని ఆ స్నేహితురాలితో నువ్వు చెప్పడం నాదాకా వినిపించింది. నేను వినాలనే నువ్వామాట ఆమెతో గట్టిగా అన్నావని నాకు తెలుసు. ఎక్కడికి వెళ్తున్నావో మాత్రం నువ్వామెతో చెప్పలేదు. బెంగుళూరు నుంచి మాత్రమే కాదు, నా జీవితం నుంచి కూడా నువ్వు నిష్క్రమిస్తున్నావనే భావం నీ గొంతులో నాకు వినిపించింది. ఆ క్షణంలో నా ముందున్న ప్రపంచమంతా ఒక్కసారిగా కూలిపోతున్న అనుభూతి కలిగింది. ఆ షాక్ నుంచి నేను తేరుకునే సరికే నువ్వక్కడ లేవు. నీకోసం నేను బయటికి పరిగెత్తాను. ఆ చుట్టుపక్కల ప్రదేశాలన్నీ గాలించాను. నువ్వు మాత్రం మళ్ళీ నాకు కనిపించలేదు. నాకంత అన్యాయం చెయ్యాలని నీకెందుకలా అనిపించింది. చెప్పు, నువ్వెందుకలా చేశావు?"

"మన మనసులు కలిసినా మనం కలవగలమనే మాట నాకెందుకో అబద్ధంలా కనిపించింది. ఎక్కడి నువ్వు ఎక్కడి నేను! నీ మీద కాదు, నా మీద నాకే అపనమ్మకం కలిగింది.



## పూజాభట్ స్వీయానుభవాలు!

'నేను కన్యని కాను' అని వివాదాస్పదమైన స్టేట్‌మెంట్స్ ఇచ్చే పూజాభట్ ప్రస్తుతం రచయిత్రి కాబోతుందట. ఎంతైనా తండ్రి (మహేష్‌భట్) ప్రభావం పిల్లలపై పడకుండా పోతుందా? తను ఓ గొప్ప రచయిత్రి అవ్వాలనే ఆశతోనే పూజాభట్ తన 'స్వీయానుభవాలను ఒక పుస్తక రూపంలో రాస్తుందట! అందులో ఎలాంటి, అనుభవాలు వుంటాయో, పబ్లిష్ అయితే చదివి చూడాల్సిందే!'

ఈ సమాజం సృష్టించే ఆటుపోట్లకు నేను తట్టుకోగలనా? అంత శక్తి నాలో వున్నదా? భగవంతుడు ప్రేమికులకు ప్రేమించే నిరంకుశత్వం ఒక్కటే ప్రసాదించాడు. ఆ ప్రేమికుల్ని కలవనివ్వని అధికారం మాత్రం సమాజానికే ఇచ్చాడు. అందుకే లోకంలో ఎక్కువ ప్రేమకథల్ని విషాదాంతాలు చేశాడు. మన కథ అంతవరకు రానివ్వి వివరికి ఎడబాటుకు తట్టుకోగల శక్తి నాలో లేదనిపించింది. అందుకే ఆదిలోనే నా ప్రేమ గొంతు నులిమేయాలని తీర్మానించుకున్నాను. అయితే నీకు తెలియకుండా నిశ్శబ్దంగా నీ జీవితంలోంచి నిష్క్రమించడానికి నాకు మనసొప్పలేదు. అందుకే నేను వెళ్ళిపోతున్నానని నీకు తెలియజేశాను. ఎక్కడికి వెళ్ళిపోతున్నానో తెలియజేసే ధైర్యం మాత్రం నాకు చిక్కలేదు. అందుకే ఆకాశంలో హరివిల్లు కరిగిపోయినట్టు నీ ముందు నుంచి నేను కరిగిపోయాను."

"నువ్వెలా వచ్చావో అలాగే కరిగిపోయావు. కానీ నా పరిస్థితి ఏమైవుంటుందో ఏ కొంచెమైనా ఆలోచించగలిగావా? నువ్వలా షాకిచ్చి వెళ్ళిపోయాక నేను పిచ్చివాడిలా తయారయ్యాను. బస్టాండ్లూ, రైల్వేస్టేషన్లూ, విమానాశ్రయాలూ పట్టుకు తిరిగాను. నువ్వులేని నా జీవితం వృథా అనిపించింది. ఒక దశలో ఆత్మహత్య చేసుకుందామా అని కూడా ఆలోచించాను. కానీ, ప్రేమ మనిషినెంత బలహీనుడిగా తయారుచేయగలదో అంతకు రెట్టింపు బలం కూడా ఇవ్వగలదు. ఆశనిరాశల మధ్య వూగిసలాడే ప్రేమికుడి పడవ ఎప్పుడూ ఆశాతీరం వైపే నడిచేందుకు మొండి ప్రయత్నం చేస్తుంది. నేనూ అదే చేశాను. ఎప్పటికైనా నిన్ను కలుసుకోలేకపోతానా అనే మొండిధైర్యమే నన్ను బ్రతికించింది. నన్ను ఆశాతీరం వైపు నడిపించింది. బెంగుళూరు నుంచి మా ఊరు తిరిగివచ్చాను."

"ఆ తర్వాత జరిగింది నాకిప్పటికీ నమ్మశక్యం కాని మహాశ్చర్యం."

"నువ్వలా భావించడంలో పొరపాటేం లేదు. కాకతాళీయంగా కూడా కొన్ని సంఘటనలు జరుగుతాయి. జరగడానికి సాధ్యం కాని విషయాలు కూడా జరుగుతాయి. నేను మా ఊరు తిరిగి వెళ్ళే సమయానికి మా ఇంటి పక్కన కొత్తగా చేరిన కుటుంబం మీదేనని నాకు వూహామాత్రంగా కూడా తెలియదు. అక్కడ నిన్ను నేను చూసిన క్షణం..."

"ఆ క్షణాన్ని నాకు గుర్తు చేయవద్దు. ఆనందంతో నా గుండె ఎంతగా పొంగిపోతుందో భయంతో అంతగా పగిలిపోతుంది. వద్దు. నాకు గుర్తుచేయవద్దు."

"గుర్తు చేయకుండా ఎలా వుండగలను? ఆ క్షణమే మన జీవితాన్ని తీవ్రమైన మలుపు తిప్పింది."

"వద్దు..."

"ఒక్కసారిగా మా ఇంటి ఎదుట నిన్ను చూసేసరికి..."

"వద్దు..."

"నాకు మతిస్థిమితం తప్పింది. ఒక్క క్షణం తల గిర్రున తిరిగిపోతున్న అనుభూతి కలిగింది."

"వద్దు..."

"ఎలా జరిగిందో తెలియదు. ఎలా వేశానో తెలియదు. నేనేం చేస్తున్నానో నాకు తెలిసేలోగానే నా కాళ్ళు నాకు తెలియకుండానే నీ వైపు పరిగెత్తాయి. నా చేతులు నాకు తెలియకుండానే నీవైపు సాగాయి."

"వద్దు... ప్లీజ్, వద్దు..."

"నా చేతులు నిన్ను ముట్టేశాయి. భూభ్రమణం ఆగిపోయింది. ఆకాశం నివ్వెరపోయి చూసింది. మన చుట్టుపక్కల ప్రపంచం నిశ్చేష్టురాలై ఆ దృశ్యం చూసింది."

"వద్దు... వద్దు..."

"కేకలు... పెడబొబ్బలు... అంతవరకు బండ నిద్రపోతున్న ప్రపంచం ఒక్క పెట్టున లేచింది. సమాజం ఒక్కసారిగా కోరలు చాచింది. రెండు చేతులు నన్నో పక్కకు లాగేశాయి. రెండు చేతులు నిన్నో పక్కకు లాగేశాయి. ఆ అరక్షణంలో కొన్ని వేల చేతులు మనిద్దరి మధ్యా దుర్భేధ్యమైన కోటగోడలు కట్టేశాయి. కులాల గోడలు, అంతస్తుల గోడలు, మర్యాద గోడలు, సంప్రదాయం గోడలు, నీతి గోడలు, నియమాల గోడలు. ఇద్దరు ప్రేమికుల బలహీనమైన పిడి కిళ్ళు ఆ గోడల్ని బద్దలు కొట్టడంతో విఫలమయ్యాయి. సమాజం యావత్తూ ఒక్కసారిగా కత్తి గట్టింది. కత్తి... పదునైన కత్తి! మన గుండెల్లో ప్రవహించే ప్రేమ రక్తం రుచిచూస్తే గానీ దాహం తీరని కత్తి..."

"వద్దు. ఆ దృశ్యం మళ్ళీ నా కళ్ళ ముందుకు తేవద్దు."

"భయపడకు. ఈ స్మశానంలో ఇప్పుడు మనల్నెవ్వరూ విడదీయలేరు. కుళ్ళూ కుత్సితాలతో, కులాల తెగల పోరాటాలతో, మతాల జాతుల యుద్ధాలతో ఈ ప్రపంచాన్ని ఇలాగే తగలడనీ. ఆ జ్వాలలు ఇక ఏమాత్రం ఈ ప్రదేశాన్ని తాకలేవు. ఇక్కడి ప్రశాంతతే ప్రశాంత. మళ్ళీ ఎన్నడూ నిద్రపోనవసరం లేని శాశ్వత నిద్ర. ఇలారా. నా చేతుల్లో వాలిపో. నన్ను నీ వడిలో వాలనివ్వు. ఈ రాత్రి నేను నిద్రపోతాను. మళ్ళీ ఎన్నడూ మేలుకోనవసరం లేకుండా హాయిగా నిద్రపోతాను." ●

# జగమంతా వింతలమయం

## "రాళ్ళు" రూపాయలుగా చెలామణీ!

అది రాతి యుగం నాటి మాట కాదు. ఈనాటి మాటే! ఏదైనా కొనుక్కోవాలంటే కూడా కొన్ని రాళ్ళు పట్టుకెళ్తే చాలు. దక్షిణ పసిఫిక్ మహా సముద్రంలో ఉన్న 'యాప్' అనే ద్వీపంలో ఈ పద్ధతి చెలామణీలో వుంది. అక్కడ రాళ్ళను దానం చెయ్యటాన్ని ఎంతో గొప్పదానంగా విశ్వసిస్తారు. ఆ ద్వీపంలోని ప్రజలు వివిధ రకాల సైజులలో రూపు దిద్దిన నల్లని రాళ్ళను నాణాలుగా ఉపయోగించుకొంటారు. సైజును బట్టి వాటి విలువ పెరుగుతుంటుందట. అతి ఎక్కువ విలువైన నాణెం సైజు మూడు అడుగుల వైశాల్యంలో వుంటుంది. పెద్ద పెద్ద బండలను పోగు చేసుకొన్నవాడు ధనవంతుడిగా చెలామణీ అవుతాడు. ఎక్కువ రాళ్ళున్న వాడే రాజుగా అక్కడ ఆమోదిస్తారు. అందుకేనేమో మన వాళ్ళు కూడా అంటుంటారు. "నాలుగు రాళ్ళు వెనకేసుకోరా" అని!

## దైవ 'భక్తి' అంటే మాటలా!

దైవభక్తి ముందు ఏ శక్తి అయినా సరే ఓడిపోవాల్సిందే అని హిందువులు పరిపూర్ణంగా నమ్ముతారు తమ దైవాలను ఎవరైనా కించపరిస్తే సహించరు. అదే జరిగింది 'బర్మింగ్ హామ్'లో. అక్కడ చిన్న పిల్లలు ఆట బొమ్మలు తయ్యారు చేసే ఓ కంపెనీ "మాన్‌స్టర్స్ ఇన్ మై పాకెట్" అనే ఒక ఇరవై నాలుగు భూతాల బొమ్మలున్న సెట్‌ను తయ్యారు చేసి మార్కెట్టులోకి పంపింది. దానిలో హిందువుల ఆరాధ్య దైవం అయినా వినాయకుని బొమ్మకూడా ఒక భూతంగా చిత్రీకరించబడింది. ఇంగ్లాండ్‌లో నివశిస్తున్న ఒక కన్నడ స్త్రీ పేరు 'చిత్రలేఖా బోలార్' అనే ఆవిడ దానిని చూసి విఘ్నేశ్వరుడు భూతం కాదని, దేవుడని ఆ కంపెనీతో చెప్పింది. వారు వినిపించుకోక నిర్లక్ష్యంగా మాట్లాడారు. దానిని సహించలేక అక్కడున్న హిందువులందరిని కలిసి కట్టుకొని పెద్ద ఎత్తున ఆందోళన లేవదీసేసరికి, ఆ కంపెనీవారు భయపడి, ఆ బొమ్మల సెట్టును మార్కెట్లోంచి తీసేసి, క్షమాపణ అడిగారట.

## అరటి 'చెట్టు'తో 'పెళ్ళి'

నమ్మకాలు ఉండాలి కాని, మరీ మూఢనమ్మకాలుంటే పిచ్చివాళ్ళ క్రింద జమ కడతారు ఈ రోజుల్లో. ప్రాంతానికీ, ప్రాంతానికీ ఆచార వ్యవహారాల్లో ఎంతో మార్పులు కనిపిస్తుంటాయి. తమిళనాడు రాష్ట్రానికి చెందిన పెరియార్ జిల్లాలో 'కేందపాడి' అనే గ్రామంలో పెళ్ళి విషయంలో వింత ఆచారం ఈనాడు కూడా ఆచరణలో వుంది. అబ్బాయికి పెళ్ళి చేసేముందు, ఒక పచ్చని అరటి చెట్టును తెచ్చి, దానికి అందంగా చీరకట్టి, అలంకరణ చేసి, పెళ్ళి కూతురిలా తీసకొచ్చి, పెళ్ళి కొడుకు ప్రక్కన నిలబెట్టి ముందు దానికి తాళి కట్టించి, ఆ తర్వాత అసలు పెళ్ళికూతురిని తీసుకొచ్చి మేళ, మంత్రాలతో వివాహం జరుపుతారు. అలా చెయ్యటానికి కారణం ఆ అరటి చెట్టు ఆనందించి, ఆ పెళ్ళి కూతుర్ని పది కాలాల పాటు సుమంగళిగా ఉండమని దీవిస్తుందని వారి నమ్మకమట. ఆ అరటి చెట్టుకే అంతశక్తి, మహిమ వుంటే, తానే స్త్రీగా మారిపోయి అతనితో కాపురం చెయ్యొచ్చుగా!

## కుక్కల 'పెళ్ళి— విందు' భోజనం

"ఎండా వానా, కుక్కల నక్కల పెళ్ళి" అని పిల్లలు పాడుకొంటూ ఆడుకోవటం చూస్తుంటాం. యధేచ్ఛగా తిరుగుతూ విచ్చల విడి శృంగారాన్ని అనుభవించే కుక్కలకు పెళ్ళి జరిపిస్తే, అవి కూడా మనుషుల్లాగా పద్ధతిగా బ్రతుకుతాయన్న ఆలోచన ఏదో, వాటికి వైభవంగా, వేద మంత్రాలతో పెళ్ళిళ్ళు జరిపిస్తుంటాడు. జైసాల్మేర్‌లో నివసిస్తున్న 'భోజరాజ్ సింగ్' అనే ధనవంతుడు. ఆయన ప్రతి సంవత్సరం తన తాతగారి ఆబ్దీకం రోజున ఆ కుక్కల పెళ్ళికి ముహూర్తం— పెట్టేస్తారట. ఆయన తాతగారికి కుక్కలంటే మనుషులకన్నా ఇష్టమట. అందువలన ఆయన ఆత్మశాంతి కోసం ఈ వివాహ కార్యక్రమం జరిపిస్తారట. పెళ్ళి జరిగిన తర్వాత ఎంచక్కా ఊరిలోని కుక్కలన్నింటికీ రుచికరమైన విందు భోజనం ఏర్పాటు చేసి ఆనందిస్తాడట సింగ్‌గారు.

— శర్మాజీ.